క్లుప్తంగా

రేపు సాధికార యాత్రను విజయవంతం చేయాలి

బిట్రగుంట: కావలి నియోజకవర్గంలో ఈ నెల 9న జరగనున్న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు కార్యకర్తలంతా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు కోరారు. ఈ నెల 9న మధ్యాహ్నం రెండు గంటలకు సాధికార యాత్రలో భాగంగా కడనూతలలోని ఆర్‌ఎస్సార్ కళాశాలలో లాయర్లు, డాక్టర్లు, ఇంజినీర్లు, విద్యావేత్తలతో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, బీద మస్తాన్‌రావు, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రులు సీదిరి అప్పలరాజు, జోగి రమేష్, ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, హఫీజ్‌ఖాన్, ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకర్, తదితరులు సమావేశమవుతారని తెలిపారు. అనంతరం సాధికార యాత్ర ప్రారంభమవుతుందని వివరించారు. కార్యకర్తలంతా భారీగా తరలిరావాలని కోరారు.

నేడు మండల సమావేశం

వరికుంటపాడు: మండల సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ గవదగట్ల వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు తప్పని సరిగా హాజరు కావాలన్నారు.

9 నుంచి 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి'

చేజర్ల: ఈ నెల 9వ తేదీ నుంచి మండలంలో 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' ప్రచార కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి మంగళవారం తెలిపారు. ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 9న చేజర్ల, 10న మడపల్లి, 14న పాడేరు, 15న చిత్తలూరు, 16న ఆదూరుపల్లి, 17న యనమదల, 20న కోటితీర్థం, 21న పెరుమాళ్లపాడు, 22న నాగులవెలటూరు, 23 వావిలేరుల్లో కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

9 నుంచి పల్లెకు పోదాం

ఆత్మకూరురూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 9వ తేదీ నుంచి మండలంలోని సచివాలయాల వారీగా 'పల్లెకు పోదాం' కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9న బట్టేపాడు, 10న నువ్వూరుపాడు, 14న చెర్లోయడవల్లి సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆయా సచివాలయాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డులను ఆవిష్కరణ, అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఆయా సచివాలయాల్లో నిర్వహించే సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చిస్తామన్నారు. సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది, గృహ సారథులు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

10న వలంటీర్లకు ఇంటర్వ్యూలు

ఆత్మకూరురూరల్: మండలంలో పడకండ్ల, అరవీడు సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న రెండు వలంటీర్ల పోస్టులకు ఈ నెల 10న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని, 10వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహించి వలంటీర్ల నియామకం చేపడతామని తెలిపారు. అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఉదయగిరి: మండలంలోని వెంగళరావునగర్ గ్రామ సచివాలయ పరిధి గండిపాళెంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వలంటీర్ పోస్టు ఎస్సీ మహిళకు రిజర్వు చేశామన్నారు. అర్హులైన వారు 9వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 13న విధుల్లో చేరాల్సి ఉందన్నారు.

చేజర్ల: మండలంలోని మాముడూరు పంచాయతీలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టు(జనరల్)కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 10వ తరగతి పాసై 18–35 ఏళ్ల లోపు వారై ఉండాలన్నారు.

కుక్కలు, కోతుల బెడద



ఆందోళన చేస్తున్న ప్రజలు

ఉదయగిరి: పట్టణంలో కుక్కలు, కోతుల బెడద అధికమైందని, వాటిని నివారించి తమను కాపాడాలని పలువురు పట్టణ ప్రజలు అధికారులను కోరుతున్నారు. కొన్ని రోజులుగా కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉందన్నారు. కుక్కలు వీధుల్లో సంచరిస్తుండడంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు బయటకు రావాలంటే హడలి పోతున్నారన్నారు. ఇటీవల సుమారు పదిహేను మందికి పైగా కుక్కకాటుకు గురయ్యారన్నారు. కోతులు ఇళ్లలోకి వెళ్లి నానా బీభత్సం సృష్టిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటి నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి



జనార్దనపురంలో లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేస్తున్న మేకపాటి రాజారెడ్డి

వింజమూరు(ఉదయగిరి): రాష్ట్ర సమగ్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సాధ్యమని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని జనార్దనపురం, బత్తినవారిపల్లి గ్రామాల్లో మంగళవారం వర్షంలో సైతం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ప్రతి ఇంటికి తిరిగి ఆయా కుటుంబాలకు ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా అందించిన లబ్ధిని బుక్‌లెట్ల ద్వారా వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం రూ.వేల కోట్లు అప్పు చేసి అభివృద్ధి సంక్షేమం కోసం నామ మాత్రంగా ఖర్చు చేసిందనానరు. అధిక మొత్తం నిధులు పెత్తందారులు, టీడీపీ అనుకూల వర్గాలు దోపిడీ చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అప్పు చేసిన ప్రతి పైసాకు జవాబుదారీతనంగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమం కోసమే ఖర్చు చేస్తోందని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం ఆరు వందల అబద్ధాలు ఆడి అధికారంలోకి వచ్చి ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో నెరవేర్చలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో వచ్చిన 99 శాతం హామీలు నెరవేర్చి ప్రజల ప్రశంసలు అందుకుంటుందన్నారు. ఈ రెండు ప్రభుత్వాల మధ్య తేడా గమనించి ప్రజల పక్షాన పని చేసే ప్రభుత్వానికి మద్దతివ్వాలని రాజారెడ్డి కోరారు. వచ్చే ఎన్నికల్లో పేదల పక్షాల ప్రజల పక్షాన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పెత్తందారుల పక్షాన చంద్రబాబు, ఆయన ఎల్లో మీడియా పని చేస్తుందని, ఎవరికి ఓటేయాలో ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి ప్రభుత్వం ద్వారా పిల్లలకు అందుతున్న వస్తువులు, సరుకుల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. నాడు–నేడు ద్వారా రూపుమారిన పాఠశాలలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య, సొసైటీ అధ్యక్షుడు మలిరెడ్డి విజయ్‌రెడ్డి, ఎంపీటీసీ డేగా వంశీ, జనార్దన్‌పురం సర్పంచ్ రమణారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు పోలుబోయిన వెంకటేశ్వర్లు, సీలం తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ చానల్‌లో దోపిడీ ఘనత టీడీపీదే

- టీడీపీ హయాంలో రూ.30కోట్ల పనికి రూ.100 కోట్లకు అంచనాలు
- నీరు–చెట్టు పేరుతో బీద రవిచంద్ర, సుబ్బానాయుడు రూ.కోట్లు దోచుకున్నారు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు

బిట్రగుంట: దగదర్తి–రాచర్లపాడు కాలువ ఆధునికీకరణ పేరుతో రూ.వంద కోట్ల దోపిడీకి స్కెచ్ వేసిన ఘనత టీడీపీ నాయకులు బీద రవిచంద్ర, మాలేపాటి సుబ్బానాయుడుకే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం బోగోలులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో ప్రపంచ బ్యాంకు నిధులతో జపాన్‌కు చెందిన జైకా సంస్థ ప్రతినిధులు డీఆర్ చానల్ అభివృద్ధికి ముందుకు వస్తే రూ.30 కోట్ల పనికి రూ.వంద కోట్లతో అప్పటి టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, దగదర్తికి చెందిన మాలేపాటి సుబ్బానాయుడు ప్రతిపాదనలు రూపొందించారని గుర్తు చేశారు. ఈ ప్రతిపాదనలు చూసి నివ్వెరపోయిన జైకా ప్రతినిధులు నిర్ద్వందంగా తిరస్కరిస్తే మరోసారి రూ. 80 కోట్లకు, చివరకు రూ.30 కోట్లకు అంచనాలు తయారు చేశారని గుర్తు చేశారు. దీన్ని బట్టి రూ.30 కోట్ల పనికి రూ.వంద కోట్ల అంచనాలు వేసి దోపిడీకి ప్రణాళిక వేసిన ఘనత బీద రవిచంద్ర, మాలేపాటి సుబ్బానాయుడిదేనని స్పష్టమవుతుందన్నారు. టీడీపీ హయాంలో నీరు–చెట్టు సహా అన్నీ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల్లో భారీగా దోచుకున్న రవిచంద్ర, సుబ్బానాయుడు తాజాగా డీఆర్ చానల్ పనుల్లో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అవినీతికి పాల్పడుతున్నాడంటూ ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏకంగా రూ.20 కోట్ల అవినీతి అంటూ సుబ్బానాయుడు మద్యం మత్తులో అర్థం పర్థం లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. మొత్తం పని విలువే రూ.27 కోట్లు కాగా, జీఎస్టీ, కాంట్రాక్టర్ వేసిన లెస్‌లు అన్నీ పోగా రూ.22 కోట్లు మాత్రమే పనికి కేటాయించడం జరుగుతుందని వివరించారు. రూ.22 కోట్ల పనిలో రూ.20 కోట్ల అవినీతి ఎలా సాధ్యమవుతుందంటూ ప్రశ్నించారు. అడ్డంగా దోచుకోడానికి ఇవేం నీరు–చెట్టు పనులు కావని, ప్రతి పని పారదర్శకంగా జరుగుతుందని స్పష్టం చేశారు. ఐఏబీ సమావేశానికి, ఐఓబీ సమావేశానికి తేడా సుబ్బానాయుడు ఇలాంటి చచ్చుపుచ్చు విమర్శలు చేస్తున్నాడని ఎద్దేవా చేశారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడి పూజ



ఆత్మకూరు శివాలయంలో అయ్యప్ప పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరాలయంలో మంగళవారం రాత్రి అయ్యప్పస్వాములు భక్తిశ్రద్ధలతో అంబళ పూజ (పడి) నిర్వహించారు. అర్చకులు మేళ్లచెరువు శివకుమార్‌శర్మ నేతృత్వంలో అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తిని వినాయక, సుబ్రహ్మణ్యం స్వాముల విగ్రహాలతో కలిపి ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసి అరటి దొప్పలతో 18 మెట్లను ఏర్పరిచి వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం శాస్త్రోక్తంగా అయ్యప్పస్వామి పడి పూజను నిర్వహించారు. స్వామి వారి భక్తి గీతాలు, భజనలు నిర్వహించారు. తదుపరి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

కర్రతుమ్మ చెట్ల తొలగింపు



కంపకర్ర చెట్లు తొలగిస్తున్న దృశ్యం

ఉదయగిరి: మండలంలోని వెంగళరావునగర్‌లో నివాసాలు, రోడ్లకు ఇరువైపులా ఉన్న కంపకర్ర చెట్లను మంగళవారం జేసీబీ సాయంతో తొలగించారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో పలువురు గ్రామస్తులు కంపకర్ర చెట్లు ఏపుగా పెరిగి విష పురుగుల బెడద ఎక్కువగా ఉందని ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మండల సమావేశంలో సర్పంచ్ మొండ్రు తిరుపతి సైతం కంప చెట్లు తొలగించాలని సభ దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన ఎంపీపీ మూలె పద్మజ తమ సొంత నిధులతో జేసీబీ ఏర్పాటు చేసి సర్పంచ్ ఆధ్వర్యంలో కంప చెట్లు తొలగింపునకు చర్యలు తీసుకున్నారు.

సంగంలో భారీ వర్షం



ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపు నీరు

సంగం: బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తన ద్రోణి కారణంగా మంగళవారం సంగం మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. ప్రధానంగా సంగంలోని ప్రధాన రహదారులు వర్షపు నీటితో నిండిపోయాయి. పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షపు నీరు వెళ్లేందుకు సరైన మార్గం లేక నీళ్లు నిలబడుతున్నాయమని పలువురు స్థానికులు అంటున్నారు. వర్షాకాలం ప్రారంభమైన అనంతరం తొలిసారిగా ఇంతటి భారీగా వర్షం కురిసిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కారు, బైక్ ఢీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని దామరమడుగు జాతీయ రహదారిపై కారు, బైక్ ఢీకొన్న ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం వైపు వెళ్తున్న ఇన్నోవా కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. అయితే డ్రైవర్ కారును రోడ్డుపైకి ఎక్కించే క్రమంలో బుచ్చి నుంచి నెల్లూరుకు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టాడు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రీసర్వే పనులు వేగవంతం చేయాలి



వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలకు సూచనలు ఇస్తున్న రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్

మర్రిపాడు: గ్రామాల్లో జరుగుతున్న జగనన్న భూహక్కు, భూరక్ష రీసర్వే వేగవంతంగా జరిగేలా రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ సహాయకులు పనిచేయాలని భూ రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలతో భూసర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న రీ సర్వే గ్రామాలను సందర్శించానని, రీసర్వేలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించ వద్దని, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఆత్మకూరు: ప్రకృతి వైపరీత్యాలు, ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలు దృష్ట్యా జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాల మేరకు ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సమాచారం కోసం కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ కె మధులత మంగళవారం తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు, తిరిగి రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు 24 గంటలు విధులు నిర్వహించేలా డిప్యూటీ తహసీల్దారు స్థాయి అధికారులను ఈ కంట్రోల్ రూమ్‌లో షిఫ్ట్ డ్యూటీల్లో ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు. దీనికి తోడు పలువురు వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులను పెన్నానది పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాల్లో ఎప్పటికప్పుడు సమాచారం తెలిపేలా సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు. వారం రోజుల పాటు ఈ కంట్రోల్ రూమ్ పని చేయనున్నట్లు ఆర్డీఓ తెలిపారు. కంట్రోల్ రూమ్‌కు సమాచారం నిమిత్తం 91009 48215, 94945 83818 నంబర్లు ఏర్పాటు చేశామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యాధికారిణి సంధ్య

వరికుంటపాడు: మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మండలంలో సీజనల్ వ్యాధులు సోకకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తం ఉండాలని మండల వైద్యాధికారిణి కరిష్మా అన్నారు. మంగళవారం ఆశా డే సందర్భంగా వైద్యశాలలో ఆమె సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇటీవల మండలంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో గుర్తించిన రెఫరల్ కేసులను జిల్లా వైద్యశాలకు తీసుకెళ్లి మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఫ్లోరోసిస్ వ్యాధి నియంత్రణాధికారిణి డాక్టర్ సంధ్య మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామం, పాఠశాలల్లో మంచినీటి వనరుల్లో ఫ్లోరిసిస్ శాతాన్ని గుర్తించాలన్నారు. ఫ్లోరిసిస్ లక్షణాలు ఉంటే వాటర్ శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపాలన్నారు. ఈ సమావేశంలో సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్‌ఎన్ సుశీలమ్మ, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

6,103 మందికి రైతు భరోసా



లింగంగుంట ఆర్బీకేలో సీఎం వైఎస్ జగన్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న రైతులు, పెద్దలు

సోమశిల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విడుదల 5వ విడత వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ రెండో విడతలో మండలంలో 6,103 మంది రైతులకు నగదు జమ అయినట్లు ఏఓ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులతో కలిసి రైతు భరోసా నగదు విడుదల కార్యక్రమాన్ని టీవీల్లో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని రైతులకు రూ.2.43 కోట్లు, 30 మంది కౌలు రైతులకు రూ.4.10 లక్షలు అందించినట్లు వివరించారు.

దంత వైద్య పరీక్షలు

వరికుంటపాడు: మండలంలోని వేంపాడు ప్రాథమిక పాఠశాలలో జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేకంగా వచ్చిన దంత వైద్యాధికారిని డాక్టర్ సంధ్య విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాగునీటిలో ఫ్లోరిన్ శాతం లేకుండా చూసుకోవాలన్నారు. ఫ్లోరిన్ వల్ల దంత వ్యాధులు వస్తాయన్నారు. ఎక్కువగా కాచి చల్లార్చి నీటిని తాగుతుండాలన్నారు.

ఉపాధి సిబ్బందికి మొబైల్ యాప్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏఎస్‌ఓ విజయ్‌కుమార్

మర్రిపాడు: ఉపాధి హామీ సిబ్బంది, వీఆర్‌ఓలకు మొబైల్ యాప్ వినియోగంపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఇన్‌చార్జి ఏఎస్‌ఓ విజయ్‌కుమార్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని వ్యవసాయ చెరువులు, చెక్‌డ్యామ్‌లు ఎక్కడెక్కడ ఉన్నాయో మొబైల్ యాప్ ద్వారా గుర్తించి ఆన్‌లైన్ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాల్సి ఉందన్నారు. ప్రజలకు చెరువులు, చెక్‌డ్యామ్‌ల ద్వారా ఉపాధి, వాటి ప్రాముఖ్యత, ఒక చెరువు ద్వారా ఎన్ని ఎకరాలకు నీరు అవసరం అవుతుందో తెలుస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్లలో ఉన్న చెరువులు, చెక్‌డ్యాములను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సునీల్‌కుమార్, గ్రామ రెవెన్యూ అధికారులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: అల్లూరు అంజినాయుడు కాలనీకి చెందిన తలమంచి అశోక్ (35) ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, అతని కుమార్తె టి సుదీప్తికి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తన నివాసంలో ఆర్థిక సాయాన్ని అందించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, అల్లూరు పట్టణ అధ్యక్షుడు దండా కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

సామాజిక సాధికార సభకు తరలిరండి



పందిటి కామరాజు

కావలి: ఈ నెల 9వ తేదీ కావలి పట్టణంలో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్ర సభకు కావలి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న సామాజిక సాధికార బస్సు యాత్ర ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేద వర్గాలకు చెందిన వారికి జరిగిన మంచిని మంత్రులు, ఎంపీలు తెలియజేస్తారన్నారు.

హిందూ ధర్మప్రచార పరిషత్ నూతన కార్యవర్గం



నూతన ధర్మ ప్రచార మండలి కార్యవర్గంతో ఆర్గనైజర్ ఆర్ స్వామినాయక్

అల్లూరు: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి నెల్లూరు జిల్లా మండలి సమావేశం మంగళవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆర్గనైజర్ ఆర్ స్వామినాయక్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ధర్మ ప్రచార మండలి సభ్యులు ఏకగ్రీవంగా అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నెల్లూరు జయరామయ్య, ఉపాధ్యక్షుడిగా కేవీ మోహన్‌రావు, కార్యదర్శిగా సాదేపల్లి రవికుమార్, కోశాధికారిగా వేమిరెడ్డి సనత్‌కుమార్‌రెడ్డిని ఎంపిక చేశారు.

పశువుల్లో వ్యాధుల నివారణా చర్యలు



మడపల్లిలో పశువుకు గొంతువాపు వ్యాధి నివారణ టీకా వేస్తున్న వైద్యాధికారి (ఫైల్)

చేజర్ల: వర్షాకాలం కావడంతో పశువులు వ్యాధుల బారిన పడకుండా నివారణ చర్యలు చేపడుతున్నట్లు చేజర్ల పశువైద్యాధికారి రాజేష్ తెలిపారు. ఈ సమయంలో పశువుల్లో గొంతు వాపు, జీవాల్లో నీలి నాలుక, మేకల్లో సీసీపీపీ వ్యాధులు వస్తాయని తెలిపారు. ఇవి పాడి రైతలకు ఆర్థికంగా నష్టాన్ని కలుగజేస్తాయని తెలిపారు. పశువులకు నట్టల నివారణ మందు తాగించిన 2, 3 రోజుల తర్వాత గొంతువాపు వ్యాధి టీకాలు వేయించడం తప్పని సరన్నారు. జీవాలకు నట్టల నివారణ మందు తాగించి నీలి నాలుక వ్యాధి ప్రబలకుండా, కొట్టాల వద్ద నీరు నిలువ లేకుండా చూచుకోవాలన్నారు. దీని వల్ల కీటకాల ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. మేకల్లో సీసీపీపీ వ్యాధి బారిన పడకుండా కొట్టాల్లో నేలను శుభ్రంగా ఉంచి, మేకలకు నివారణ మందును తాగించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

బోర్ల మరమ్మతులకు సామగ్రి సిద్ధం



కార్యాలయానికి చేరిన బోర్ల విడి భాగాల సామగ్రి

ఉదయగిరి: మండలంలో మంచినీటి బోర్లు మరమ్మతులకు గురైతే సకాలంలో బాగుచేసి తాగునీరందించేందుకు అవసరమైన సామగ్రి అందుబాటులో ఉన్నాయని ఎంపీడీఓ ఈశ్వరమ్మ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రం నుంచి వచ్చిన బోర్ల మెటీరియల్‌ను సరి చూసుకుని స్టాక్ రూమ్‌లో భద్రపరిచారు. బోర్ హెడ్స్, వాటర్ చాంబర్స్, సిలిండర్స్, పంపు బ్యాటరీలు, హ్యాండిల్స్ తదితర సామగ్రి వచ్చాయన్నారు. బోర్ల విడిభాగాల కొరత లేదన్నారు.

ఊరి మధ్యలో మురుగునీరు



రామస్వామిపల్లి గ్రామ నడిబొడ్డున మురుగు నీటి నిల్వలు

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లిలో పారిశుధ్యం పడకేసింది. గ్రామ నడిబొడ్డున మురుగు నీటి నిల్వలు ప్రజలకు ఇబ్బందిగా పరిణమించాయి. వినాయకుడు గుడి, రైతు భరోసా కేంద్రం ప్రాంతాల్లో వర్షపు నీటి నిల్వలు నిలిచిపోవడంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో నీటి నిల్వలు వల్ల అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు తక్షణం స్పందించి మురుగు నీటిని తొలగించి ఇబ్బందులు లేకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

మర్రిపాడు: మండలంలోని నందవరం ఆదర్శ పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొంది బదిలీ అయిన పేట శ్రీనివాసులరెడ్డిని మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పేట శ్రీనివాసులరెడ్డి పదోన్నతిపై ఉయ్యాలవాడ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌గా బదిలీ అయ్యారు.